బలగం BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శనివారం 27 సెప్టెంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4

## బతుకమ్మ వేడుకలకు ప్రపంచ సుందరి



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ప్రపంచ సుందరి ఒపాల్ సుచాతా చువాంగ్ తెలంగాణ బతుకమ్మ వేడుకలకు హాజరు కానున్నారు. ఈ నెల 29న జరిగే సంప్రదాయ పండగ బతుకమ్మ కార్యక్రమంలో ఆమె సందడి చేయనున్నారు. కాగా హైదరాబాద్ వచ్చిన ఆమె శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఈ నెల 28న జరిగే కాన్సర్ అవగాహన ర్యాలీ పింక్ రన్‌లో పాల్గొంటానని తెలిపారు. కాన్సర్ వల్ల అనేకమంది మహిళలు అవగాహన లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తన మొదటి ప్రాధాన్యం కాన్సర్‌పై అవగాహనే అని స్పష్టం చేశారు. ఇక 29న తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బతుకమ్మ వేడుకల్లో పాల్గొంటానని తెలిపింది. హైదరాబాద్‌లో తాను ప్రపంచ సుందరిగా ఎన్నికయ్యానని ఈ ప్రాంతం తనకు ఎంతో ఇష్టమని పేర్కొంది. ఇదిలా ఉండగా ఫర్హ్యాన్ సంస్థ శనివారం రోజు అనాధ లకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో ఆమె పాల్గొంటారని నిర్వాహకుడు డాక్టర్ రామకృష్ణ తెలిపారు. ఏడాది పాటు అనాధ పిల్లలకు అవసరమైన వస్తువులను సమకూరుస్తామని చెప్పారు.

### బీహార్ మహిళలకు
# ప్రధాని మోడీ భారీ గిఫ్ట్

**మహిళా ఉపాధి స్కీమ్ కింద**
**7.5 మిలియన్ల మహిళల ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.10,000 జమ**



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

దేశంలో మహిళల ఆర్థిక శక్తివంతానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమలు చేస్తున్న పథకాల జాబితాలో కొత్తగా మహిళా ఉపాధి స్కీమ్ చేరింది. ఈ క్రమంలో బీహార్‌లో 7.5 మిలియన్ల మహిళల బ్యాంకు ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున మొదటి విడత నిధులను మోదీ శుక్రవారం జమ చేశారు. ఉదయం 11 గంటలకు వర్చువల్‌గా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కూడా పాల్గొన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఈ పథకం ఒక ప్రధాన గేమ్‌ఛేంజర్‌గా భావిస్తున్నారు.

ప్రధాని మాట్లాడుతూ, ఈ పథకం ద్వారా ప్రతి మహిళా ఆర్థికంగా లాభపడుతుందని, చిన్న వ్యాపారాలు ప్రారంభించే అవకాశం కలుగుతుందని తెలిపారు. "కిరాణా దుకాణాలు, స్టేషనరీ, సౌందర్య సాధనాల దుకాణాలు మొదలైన వ్యాపారాలు మహిళలు చేపడితే, 6 నెలల తర్వాత సమీక్ష ఆధారంగా రూ.2 లక్షల వరకు అదనపు రుణం అందుతుంది" అని ఆయన పేర్కొన్నారు. నవరాత్రి పర్వదినాల్లో ఈ పథకాన్ని ప్రారంభించడం ఆనందదాయకమని, మహిళల ఆశీస్సులు తనకు బలాన్నిస్తాయని మోదీ అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఈ స్కీమ్‌లో చేరాలనుకునే వారు గ్రామసంస్థ లేదా జీవనోపాధి గ్రూప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఆధార్, పాన్, బ్యాంక్ పాస్‌బుక్, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు అవసరమవుతాయి. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ అవుతాయి. బీహార్ ప్రభుత్వ లక్ష్యం మహిళలను స్వావలంబనతో శక్తివంతం చేయడమే. ఈ స్కీమ్ ద్వారా మహిళల ఆర్థిక, సామాజిక స్థితి మెరుగవుతుందని అధికారులు తెలిపారు.

### బీసీలకు
# స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లు

- పభుత్వం జీఓ విడుదల
- ఎన్నికలకు మార్గం సుగమం
- నేడు సీఎస్‌తో పాటు ఆయా శాఖల ఉన్నతాధికారులతో ఎన్నికల సమావేశం



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో


తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బి.సి.లకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ జి.ఓ. నెం.9ను శుక్రవారం విడుదల చేసింది. హైకోర్టు ఇచ్చిన గడువులోగా ఎన్నికలు నిర్వహించేందుకు ఈ నిర్ణయం కీలకంగా మారింది. సెప్టెంబర్ 30లోపు స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేసి ఫలితాలు ప్రకటించాలని హైకోర్టు ఇప్పటికే ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. దీంతో రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నాహాలు వేగవంతం చేస్తోంది. ఈ నేపథ్యంలో శనివారం సీఎస్ రామకృష్ణరావు, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించనున్నారు. నోటిఫికేషన్ కూడా త్వరలో వెలువడనుంది.

రాష్ట్రంలో 12,760 గ్రామపంచాయతీలు, 1,12,534 వార్డులు, 565 జడ్‌పీటీసీలు, 5,763 ఎం.పి.టీసీలకు ఎన్నికలు జరగనున్నాయి. అనంతరం 565 మండల పరిషత్‌లు, 31 జిల్లా పరిషత్ చైర్మన్‌లకు కూడా ఎన్నికలు జరుగుతాయి. గత ఏడాది అక్టోబర్‌లో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే నిర్వహించేందుకు జి.ఓ. నెం.18 జారీ చేయగా, అనంతరం నవంబర్‌లో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బుసాని వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేశారు.

ఆ కమిషన్ మార్చి 2025లో నివేదిక సమర్పించింది. రాష్ట్ర జనాభాలో 56.33 శాతం ఉన్న బి.సి.లు రాజకీయ ప్రాతినిధ్యంలో వెనుకబడి ఉన్నారని పేర్కొంది. కనీసం 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని సిఫారసు చేసింది. దాని ఆధారంగానే ప్రస్తుత జి.ఓ.ని ప్రభుత్వం జారీ చేసింది.

రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ఓటర్ల జాబితాలు మొదలు అన్ని ఏర్పాట్లను పూర్తిచేసింది. ఎన్నికల నిర్వహణపై కేంద్ర ఎన్నికల సంఘానికి కూడా సమాచారం ఇచ్చింది. బీసీ రిజర్వేషన్లపై జీవో నెంబర్ 09ని ప్రభుత్వ కార్యదర్శి జ్యోతి బుద్ధ ప్రకాశ్ విడుదల చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో శాంతిభద్రతలపై సమీక్షించేందుకు డీజీపీతో రాష్ట్ర ఎన్నికల సంఘం భేటీ అయ్యింది. మరోవైపు క్షేత్రస్థాయిలో అధికారులకు శిక్షణా కార్యక్రమాలు పూర్తయ్యాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 డి(6), ఆర్టికల్ 243 టి(6) ప్రకారం సీట్ల రిజర్వేషన్ కోసం నిబంధనలు రూపొందించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కేటాయింపు విషయంలో రిటైర్డ్ ఐఏఎస్ డాక్టర్ బుసాని వెంకటేశ్వరరావు ప్రత్యేక కమిషన్, తెలంగాణ ప్రభుత్వం ఫిబ్రవరి 2024లో చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల(ఎస్ఈఈఈపీసీ) సర్వేలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో బీసీల జనాభా 56.33 శాతంతో పోలిస్తే రిజర్వేషన్లు తక్కువగా ఉన్నాయని ఎత్తిచూపుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కనీసం 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని వన్‌మెన్ కమిషన్ నివేదిక సమర్పించిన విషయాన్ని ప్రస్తావిం చారు. బీసీ జనాభాకు తగ్గట్టుగా రాజకీయ ప్రాతినిధ్యం లేనందున వారి సంక్షేమం, అభివృద్ధి కోణంలో స్థానిక సంస్థల్లో ప్రస్తుత రిజర్వేషన్ స్థాయిని 42 శాతానికి పెంచాలని కమిషన్ చేసిన సిఫారసును రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిందని పేర్కొన్నారు. "తెలంగాణ వెనుకబడిన తరగతులు (గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో సీట్ల రిజర్వేషన్లు) బిల్లు, 2025 (ఎల్.ఎ.బిల్. నం.04 ఆఫ్ 2025)"ను అన్ని రాజకీయ పార్టీలు అసెంబ్లీ, శాసనమండలిలో ఏకగ్రీవంగా ఆమోదించాయ ని ప్రస్తావించారు. జీవోకు అనుగుణంగా నడుచుకోవాల ని ఆయా శాఖల ఉన్నతాధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను మిగితా 2వ పేజీలో

## తెలంగాణ పర్యాటకానికి కొత్త ఊపు




బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ప్రపంచ పర్యాటకులను ఆకర్షించడంతో పాటు ఆ రంగంలో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాలని లక్ష్యంగా సంకల్పించిన ప్రభుత్వం అందుకు అనుగుణంగా అడుగులు వేస్తోంది. ప్రభుత్వ – ప్రైవేటు భాగస్వామ్యంతో పెట్టుబడులను ఆహ్వానిస్తోంది.ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం హైదరాబాద్ శిల్పారామం వేదికగా నిర్వహించే తెలంగాణ టూరిజం కాంక్లేవ్ – 2025లో ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు నూతన ప్రాజెక్టులను ఆవిష్కరించనున్నారు.

తెలంగాణ టూరిజం పాలసీని ఆవిష్కరించిన నేపథ్యంలో పలు సంస్థలు రాష్ట్రంలో అంతర్జాతీయస్థాయి ప్రమాణాలు కలిగిన హోటళ్లు, వెల్‌నెస్ సెంటర్లు, హాస్పిటాలిటీ ప్రాజెక్టుల ఏర్పాటుకు ముందుకొచ్చాయి. టూరిజం కాంక్లేవ్ లో పర్యాటక శాఖ చేపట్టనున్న పలు కార్యక్రమాలతో పాటు నూతన ప్రాజెక్టులను ముఖ్యమంత్రి గారు ఆవిష్కరిస్తారు.ప్రధానంగా అనంతగిరి కొండల్లో జాయ్‌సన్ – మేఘా సంస్థ సంయుక్త భాగస్వామ్యంతో అత్యాధునిక వెల్‌నెస్ సెంటర్, ద్రాక్ష నుంచి వైన్ తయారీ యూనిట్, అటవీ ప్రాంతంలో తాజ్ సఫారీ, మహీంద్రా కంపెనీ ఆధ్వర్యంలో వాటర్ ఫ్రంట్ రిసార్ట్స్, ఫైవ్ స్టార్ హోటల్స్, తెలంగాణలో టైర్ 2 నగరాల్లో జింజర్ హోటళ్లు, నాగార్జున సాగర్‌లో వెల్‌నెస్ రిట్రీట్ సెంటర్ ఏర్పాటు వంటి ప్రాజెక్టులను ప్రకటించబోతున్నారు. బుద్ధవనాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు తైవాన్‌కు చెందిన %ఖీశీ +ఖుఅస్త్ర రాష్ట్రుఅ% సుముఖంగా ఉంది. ముఖ్యమంత్రి గారి సమక్షంలో ఈ సంస్థలు ఆయా ప్రాజెక్టులకు సంబంధించి ఒప్పందాలు చేసుకోనున్నాయి. ఫలితంగా రాష్ట్రానికి రూ.15 వేల కోట్లు పెట్టుబడులు రావడంతో పాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 50 వేల మందికి ఉపాధి లభించనుంది.

చలన చిత్రాల నిర్మాణంలో ప్రపంచ స్థాయి కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలన్న సంకల్పంతో చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా ఫిల్మ్ ఇన్ తెలంగాణ పోర్టల్‌ను ప్రారంభించనున్నారు. సినిమా నిర్మాణాలకు సంబంధించి ఈ పోర్టల్ ద్వారా సింగిల్ విండో అనుమతులు మంజూరు చేయడంతో పాటు ఏఐ ద్వారా ద్వారా వివిధ లొకేషన్లలో షుటింగ్‌లకు తక్షణ అనుమతి లభిస్తుంది.వైద్యం కోసం ప్రపంచ నలుమూలల నుంచి ఇప్పటికే హైదరాబాద్ నగరానికి పెద్ద సంఖ్యలో వస్తున్న నేపథ్యంలో మరింత విస్తృతం చేయాలన్న ఆలోచనతో మెడికల్ వాల్యూ టూరిజం (ఎంవీటీ) పోర్టల్‌ను కూడా ప్రారంభిస్తున్నారు.

హైదరాబాద్‌లోని ఆసుపత్రులు, అందుబాటులో ఉన్న వైద్య సేవలు, బీమా సౌకర్యం, వీసా జారీ, పొడగింపు వంటి సేవల వివరాలు పోర్టల్ ద్వారా అందుబాటులోకి వస్తాయి. ఆయా దేశాల నుంచి వచ్చే వారికి మిగితా 2వ పేజీలో

## అప్రమత్తంగా ఉండండి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిస్థితులపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు , ఇతర ఉన్నతాధికారులతో సమీక్షించారు. జిల్లాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.పలు జిల్లాల్లో ఈరోజు, రేపు రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచనల మేరకు ఆయా జిల్లాల్లో కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ప్రమాదకర పరిస్థితులు ఉన్న చోట ముందస్తు హెచ్చరికలతో ప్రజలను అప్రమత్తం చేయడమే కాకుండా అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్ నగరంలో కురుస్తున్న వర్షం నేపథ్యంలో జీహెచ్ఎంసీ, హైడ్రాతో పాటు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను అప్రమత్తంగా ఉంచాలని, భారీగా నీరు చేరే ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకునేలా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తంగా చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గారికి సూచించారు.



## తెలంగాణ కొత్త డీజీపీగా శివధర్ రెడ్డి

- ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక ఉత్తర్వుల స్వీకరణ

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా శివధర్ రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శివధర్ రెడ్డి నియామక ఉత్తర్వులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు గారు కూడా పాల్గొన్నారు. ప్రస్తుతం డీజీపీ (ఇంటెలిజెన్స్)గా పనిచేస్తున్న శివధర్ రెడ్డి గారు, రాష్ట్ర కొత్త డీజీపీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారికి అభినందనలు తెలిపారు.

శివధర్‌రెడ్డికి పోలీస్ శాఖలో అపార అనుభవంతో పాటు చిత్తశుద్ధి, నిజాయితీ, సమర్థుడైన ఐపీఎస్ అధికారిగా పేరున్నది. శివధర్‌రెడ్డి 1994లో ఐపీఎస్ సర్వీసుకు ఎంపికయ్యారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం తూలిఖాన్ గ్రామంలో జన్మించిన శివధర్‌రెడ్డి హైదరాబాద్‌లోనే ఎల్ఎల్‌బీ వరకు విద్యాభ్యాసం చేశారు. కొంత కాలం పాటు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. తర్వాత సివిల్ సర్వీస్ పరీక్ష రాసిన శివధర్‌రెడ్డి ఐపీఎస్ అధికారిగా పోలీస్ శాఖకు ఎంపికయ్యారు. మొదట విశాఖ జిల్లా అనకాపల్లి, చింతపల్లి ఏఎస్పీగా పోలీసు శాఖలో విధులను ప్రారంభించిన ఆయన తర్వాత గ్రేహౌండ్స్ ఏఎస్పీగా, అనంతరం నెల్లూరు, గుంటూరు, నల్లగొండ, శ్రీకాకుళం మిగితా 2వ పేజీలో

# ఔషధాలపై 100% సుంకం

- అక్టోబర్ 1 నుంచి అదనపు పన్నులు అమల్లోకి
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

భారతీయ ఉత్పత్తులపై ఇప్పటికే 50 శాతం సుంకాలు విధించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, తన సుంకాల డోసును మరింత పెంచారు. ఆరోగ్యరంగానికి కీలకమైన ఫార్మస్యూటికల్స్‌పై ఏకంగా 100 శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. కిచెన్ క్యాబినెట్లు, బాత్‌రూమ్ సామగ్రిపై 50 శాతం, సోఫాలు%-%కుర్చీలు వంటి పరికరాలపై 30 శాతం, భారీ ట్రక్కులపై 25 శాతం దిగుమతి సుంకాలు అమల్లోకి రానున్నాయి. ఈ కొత్త నిబంధనలు అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వస్తాయని ట్రంప్ తెలిపారు.

**అమెరికాలో తయారీకి ప్రోత్సాహం**

ట్రంప్ సోషల్ మీడియా వేదికలో వెల్లడించిన ప్రకారం, అమెరికాలో ఉత్పత్తులను తయారు చేయించే దిశగా ఈ సుంకాల నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. కొత్తగా ఔషధ తయారీ ప్లాంట్లు నిర్మిస్తున్న కంపెనీలకు ఈ సుంకాలు వర్తించవని ఆయన స్పష్టం చేశారు. అయితే, ఇప్పటికే కర్మాగారాలు నడుపుతున్న సంస్థలపై ఈ పన్నులు వర్తిస్తాయా లేదా అనేది స్పష్టత రాలేదు.

**ధరల పెరుగుదల భయం**

2024లో అమెరికా దాదాపు 233 బిలియన్ డాలర్ల విలువైన ఔషధాలను దిగుమతి చేసుకున్నట్లు సెన్సస్ బ్యూరో వెల్లడించింది. కొత్త సుంకాల వల్ల ఔషధ ధరలు రెట్టింపు అయ్యే అవకాశం ఉందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఆరోగ్య సంరక్షణ ఖర్చులు, మెడికేర్, మెడికెయిడ్ భారం పెరగవచ్చని కెనడియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ వైస్ ప్రెసిడెంట్ పాస్కల్ చాన్ హెచ్చరించారు. అత్యవసర మందుల ధరలు పెరగడం వల్ల రోగులు వాటిని వదిలేయాల్సి వచ్చే పరిస్థితి తలెత్తవచ్చని ఆయన అన్నారు.

ఇళ్ల కొరత, మార్టిగేజ్ వడ్డీ రేట్ల పెరుగుదలతో ఇల్లు కొనాలనుకునే వారికి కొత్త కిచెన్ క్యాబినెట్లపై సుంకాలు భారమవనున్నాయి. ప్రస్తుతం అమెరికాలో ఇంటి సగటు ధర 4,32,600 డాలర్లకు చేరుకుంది.

భారీ ట్రక్కుల దిగుమతులు, విడిభాగాలు అమెరికా దేశీయ తయారీదారులను దెబ్బతీస్తున్నాయని, వారిని రక్షించేందుకే అదనపు 25 శాతం సుంకం విధిస్తున్నట్లు ట్రంప్ సూచించారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం అమెరికా ఆర్థిక వ్యవస్థకు సవాల్ కాదని ఆయన స్పష్టం చేశారు.

## 280 ఎకరాల భూములపైనే సీఎం కన్ను



- సీఎం ఏకపక్ష నిర్ణయాలతో ప్రజలపై రూ.15 వేల కోట్ల భారం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎల్ అండ్ టీకి కాంగ్రెస్ ప్రభుత్వం అప్పగించిన 280 ఎకరాల భూములపైనే సీఎం కన్ను పడిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడిన కేటీఆర్, హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టు నుంచి ఎల్ అండ్ టీ ఎందుకు అర్ధాంతరంగా తప్పుకున్నదనే విషయంలో సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

కేటీఆర్ వ్యాఖ్యానిస్తూ, "కరోనా కష్టకాలం, రాష్ట్ర విభజన తర్వాత రైడర్‌షిప్ తగ్గుతుందన్న అపోహలను ఎదుర్కొని ఎల్ అండ్ టీ నిలబడింది. అయితే సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా సంస్థ అధికారులను బెదిరించి, జైల్లో వేస్తానని హెచ్చరించారన్నది నిజమైతే ఇది నియంతృత్వం కాదా?" అని ప్రశ్నించారు. మేడిగడ్డ ప్రాజెక్టు, ఎయిర్‌పోర్టు మెట్రో, కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ వంటి అంశాల్లో కూడా ఎల్ అండ్ టీని సిస్టమాటిక్‌గా అవమానపరిచి, డిస్‌క్వాలిఫై చేస్తూ వెళ్లగొట్టారని ఆరోపించారు. "ఎల్ అండ్ టీ వెళ్ళిపోవడంతో రాష్ట్ర ప్రజల భుజాలపై రూ.15 వేల కోట్ల భారం పడింది. ఇది మొత్తం సీఎం బ్లాక్‌మెయిల్ రాజకీయాల ఫలితం" అని అన్నారు.

అలాగే, ఈ 22 నెలల్లో సీఎం రేవంత్ రూ.2.20 లక్షల కోట్ల అప్పులు చేశారని కాగ్ నివేదికలో స్పష్టమైందన్నారు. ఎల్ అండ్ టీ వెళ్లిపోవడం వల్ల మరిన్ని అప్పులు పెరిగి, ప్రజలపై భారమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్ అండ్ టీకి కేటాయించిన 280 ఎకరాల భూములు సీఎం సమీప సంస్థలకు మళ్లించాలనే ప్రణాళికలో ఉన్నారని కేటీఆర్ ఆరోపించారు. "ఈ మాల్స్, ఈ భూముల మీద ఎవరి పేర్లు రాసుకుంటారో చూడాల్సిందే. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ పేరిట దోపిడీకి తెరతీస్తున్నారు" అని విమర్శించారు.

## జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి సునీత



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ అసెంబ్లీ బైఎలక్షన్‌కు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా మాగంటి సునీత పేరును ఖరారు చేశారు. పార్టీ అధినేత కేసీఆర్ శుక్రవారం అధికారికంగా ఈ విషయాన్ని ప్రకటించారు. జూబ్లీహిల్స్ ప్రజల ఆకాంక్షల మేరకే సునీతకు అవకాశం ఇస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. కేసీఆర్ మాట్లాడుతూ, "చిత్తశుద్ధి కలిగిన నిస్వార్థనేతగా మాగంటి గోపీనాథ్ నిబద్ధతను పార్టీ పరిశీలించింది. ఆయన పార్టీకి, ప్రజలకు అందించిన సేవలకు గుర్తింపుగా ఈ గౌరవాన్ని ఇస్తున్నాం" అని తెలిపారు.

**గోపీనాథ్ ఆకస్మిక మరణంతో బైఎలక్షన్**

మాగంటి గోపీనాథ్ జూబ్లీహిల్స్ నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ తరపున విజయం సాధించారు. అయితే 2025 జూన్ 5న గుండెపోటుతో ఏఐజీ ఆసుపత్రిలో చేరగా, చికిత్స పొందుతూ జూన్ 8న తుదిశ్వాస విడిచారు. ఆయన ఆకస్మిక మరణంతో జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక తప్పనిసరి అయింది.

### ఫిరాయింపు ఎమ్మెల్యేలపై
## 29 నుంచి ప్రత్యక్ష విచారణ

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారంపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఈ నెల 29వ తేదీ నుంచి ప్రత్యక్ష విచారణ చేపట్టనున్నారు. ఇప్పటికే పార్టీ ఫిరాయించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. లిఖితపూర్వక సమాధానాల కోసం ఇచ్చిన గడువు ముగియగా, కొంతమంది మరింత సమయం కోరినా ఆ గడువు కూడా పూర్తయ్యింది.ఈ క్రమంలో కడియం శ్రీహరి, కాలే యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాష్ గౌడ్ శుక్రవారం స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కలిసి వివరణ ఇచ్చుకున్నారు. ఈ సమావేశంలో అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు కూడా పాల్గొన్నారు. కడియం శ్రీహరి తనకు ఈ నెలాఖరు వరకూ గడువు ఇవ్వాలని స్పీకర్‌ను కోరగా, మిగతా నేతలు ఇప్పటికే తమ వాదనలు సమర్పించినట్లు సమాచారం. మిగితా 2వ పేజీలో

## త్వరలో అమెరికాతో వాణిజ్య ఒప్పందం

- కేంద్ర వాణిజ్య శాఖ వెల్లడి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

అమెరికాతో వీలైనంత త్వరలో వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందని కేంద్ర వాణిజ్య శాఖ తెలియజేసింది. ఇరు దేశాలకు మేలు చేకూరేలా, సాధ్యమైనంత త్వరగా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడానికి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించింది. వాణిజ్య సమస్యలపై చర్చల కోసం అమెరికాకు వెళ్లిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ నేతృత్వంలోని భారత ప్రతినిధి బృందం ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. పరస్పర ప్రయోజనకర వాణిజ్య ఒప్పందం కోసం ఇరు దేశాల మధ్య చర్చలు సానుకూల దృక్పథంతో కొనసాగుతున్నాయని, ఈ చర్చలు ఫలప్రదమై త్వరలోనే ఒప్పందం ఖరారవుతుందనే సంకేతాలు కనిపిస్తున్నట్లు పేర్కొంది.

వాణిజ్య ఒప్పందంలోని వివిధ అంశాలపై భారత ప్రతినిధి బృందం అమెరికా మిగితా 2వ పేజీలో

## రేవంత్ రెడ్డి ఓ 'యూ-టర్న్ సీఎం'

- మాజీ మంత్రి హరీశ్‌రావు



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆదాయం పెంచుకోవడానికి ప్రభుత్వం "అడ్డదారులు వెతుక్కుంటోంది, ప్రజలపై పన్నుల భారం మోపుతోంది" అని ఆయన ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలు మరిచిపోయి మద్యం పాలసీతో ఖజానాను నింపే పనిలో పడ్డారని, మద్యం షాపుల దరఖాస్తు ఫీజు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచారని, బెల్ట్‌షాపులు ఎత్తేస్తామన్న కాంగ్రెస్ ఇప్పుడు గ్రామాలు గ్రామాలకూ మద్యం చేర్చుతోందని అన్నారు. మిగితా 2వ పేజీలో

# పే స్కేలు వర్తింపజేయండి

- **మంత్రి సీతక్కకు ఉపాధిహామీ ఉద్యోగుల వినతి**
- **సానూలంగా స్పందిస్తూ ఫైల్ సిద్ధం చేయాలని ఆదేశించిన మంత్రి**

**బలగం టీవీ, హైదరాబాద్**



ఉపాధి హామీ చట్టంలో భాగంగా 20 ఏండ్ల నుంచి పనిచేస్తున్న తమకు పేస్కేలు వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉపాధి హామీ చట్టం ఉద్యోగుల జేఏసీ కోరింది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి సీతక్కకు జేఏసీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె వద్ద పలు అంశాలను ప్రస్తావించారు. ఏటా కేవలం రూ. 30 కోట్లు అదనంగా వెచ్చిస్తే పేస్కేలు అమలు చేయొచ్చనే విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి సీతక్క పేస్కేల్‌కు సంబంధించిన ఫైల్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పేస్కేల్‌పై క్యాబినెట్లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న చిరు ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని స్పష్టం చేశారు. పలు సాంకేతిక సమస్యలను కారణంగా చూపుతూ పే అండ్ అకౌంట్స్ సెక్షన్ తమ జీతాల చెల్లింపుల్లో జాప్యం చేస్తుందని జేఏసీ నేతలు మంత్రికి మొర పెట్టుకున్నారు. వెంటనే స్పందించిన మంత్రి సీతక్క పే అండ్ అకౌంట్స్ సెక్షన్ అధికారులతో మాట్లాడారు. చిన్న చిన్న సమస్యలతో చిరు ఉద్యోగుల జీతాలు ఆపొద్దనీ, మానవతా దృక్పథంతో వ్యవహరించి జీతాలు చెల్లించాలని ఆదేశించారు. తమ పేస్కేలు డిమాండ్‌కు సానుకూలంగా స్పందించిన మంత్రి సీతక్కకు నరేగా-ఎఫ్‌టీఈఎస్ జేఏసీ చైర్మెన్ లింగయ్య, ఇతర ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

# త్వరలో అమెరికాతో వాణిజ్య ఒప్పందం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వంతో నిర్మాణాత్మక సమావేశాలు నిర్వహించినట్లు వాణిజ్య శాఖ వెల్లడించింది. అమెరికా కూడా భారత్‌లో తమ వ్యాపార కార్యకలాపాలను మరింతగా విస్తరించుకోవాలనే ఆలోచనను వ్యక్తం చేసినట్లు తెలిపింది. భారత్‌తో టారిఫ్ చర్చలు గొప్పగా జరుగుతున్నాయని అమెరికా వాణిజ్య కార్యదర్శి హొవార్డ్ లుట్నిక్ వెల్లడించారు. ఇరు దేశాలు సమష్టిగా ప్రయోజనాలను గుర్తించినట్లు తెలిపారు.

# రేవంత్ రెడ్డి ఓ 'యూ-టర్న్ సీఎం'

(మొదటి పేజీ తరువాయి)

మద్యం అమ్మకాలు పెంచాలని అధికారులపై ఒత్తిడి తెస్తూ, టార్గెట్ చేరకపోతే మెమోలు ఇస్తున్న ఘనత ఈ ప్రభుత్వానిదేనని హరీశ్‌రావు విమర్శించారు. మైక్రో బ్రూవరీలు ప్రతి ఊరికి తెచ్చి ప్రజల ఆరోగ్యాలతో ఆటలు ఆడుతున్నారని ఆరోపించారు. మహిళలకు కల్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం, యువతకు నెలకు రూ.2,500 వాగ్దానం అమలు కాలేదని, గీతకార్మికులకు నష్టపరిహారం ఇవ్వడంలో కూడా ప్రభుత్వం విఫలమైందని ఆయన అన్నారు. గౌడ సోదరులకు వైన్ షాపుల్లో 25 శాతం రిజర్వేషన్ వాగ్దానం చేసి, కేసీఆర్ ఇచ్చిన 15 శాతం రిజర్వేషన్లు కూడా రద్దు చేశారని హరీశ్‌రావు విమర్శించారు. "పబ్బులు, క్లబ్బులు మూయిస్తామన్న రేవంత్ రెడ్డి, ఇప్పుడు కొత్త పబ్బులకు అనుమతులు ఇస్తూ కమీషన్లు వసూలు చేస్తున్నాడు. ఎన్నికల్లో చెప్పింది ఒకటి, అధికారంలో చేస్తున్నది మరొకటి. రేవంత్ రెడ్డి నువ్వు ఓ 'యూ-టర్న్ సీఎం'" అని హరీశ్‌రావు ఘాటుగా వ్యాఖ్యానించారు.

# తెలంగాణ కొత్త డీజీపీగా శివధర్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

జిల్లాల ఎస్పీగా, హైదరాబాద్ నగర ట్రాఫిక్ డీసీపీగా, దక్షిణ మండలం డీసీపీగా విధులను నిర్వహించి సమర్థుడైన అధికారిగా పేరు పొందారు. ఆ తర్వాత ఇంటర్నేషనల్ టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యాన కొసావో శాంతి పరిరక్షక దళంలో పని చేసిన ఆయన.. ఆ తర్వాత యాంటీ నక్సలైట్ నిఘా విభాగం (ఎస్ఐబీ) డీఐజీగా విధి నిర్వహణ సాగించారు. అనంతరం ఏసీబీ డైరెక్టర్‌గా పని చేసిన ఆయన 2012 నుంచి 2014 వరకు వైజాగ్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. 2014 జూన్ 2న తెలంగాణ కొత్త రాష్ట్రంగా అవతరించాక రాష్ట్ర తొలి ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఆయన నియమితులయ్యారు. ఈ సమయంలోనే గ్యాంగ్‌స్టర్ నయీమ్ ఎన్‌కౌంటర్ జరిగింది. అనంతరం కొద్ది రోజుల తర్వాత కొన్ని కారణాలతో ప్రభుత్వం ఆయనను అక్కడి నుంచి ఆకస్మికంగా బదిలీ చేసింది. తెలంగాణకు బలమైన మద్దతుదారుడిగా పేరు పొందిన శివధర్‌రెడ్డిని ప్రభుత్వం ఆకస్మికంగా బదిలీ చేయటం ఆ సమయంలో చర్చనీయాంశంగా మారింది. ఆ తర్వాత రైల్వే, రోడ్డు భద్రత విభాగం ఐజీగా నియమితులయ్యారు. అక్కడి నుంచి డీజీపీ కార్యాలయంలో కోఆర్డినేషన్ ఐజీ, అదనపు డీజీగా దాదాపు ఎనిమిదేండ్ల పాటు పని చేసిన ఆయన.. 2023లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రాష్ట్ర ఇంటెలిజెన్స్ చీఫ్‌గా తిరిగి నియమితులయ్యారు. అక్కడే డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హోదాకు పదోన్నతి పొందిన శివధర్‌రెడ్డి.. తాజాగా రాష్ట్ర పోలీస్ బాస్ డీజీపీగా నియమితులయ్యారు. వివిధ హోదాల్లో ఆయన పని చేస్తూ ముఖ్యంగా సీపీఐ(మావోయిస్టు) కార్యకలాపాల అణచివేతలోనూ, అజ్ఞాతంలో ఉన్న అనేక మంది తీవ్రవాదులను జనజీవన స్రవంతిలోకి తీసుకురావటంలోనూ ప్రత్యేక కృషి సల్పారు. ఐఎస్ఐ ఉగ్రవాద కార్యకలాపాల అణచివేతలో సైతం శివధర్‌రెడ్డి కీలక పాత్రను నిర్వహించారు.

**పలు పతకాలు అందుకున్న శివధర్‌రెడ్డి**

విధినిర్వహణలో చేసిన కృషికిగానూ ఆయనకు రాష్ట్రపతి పోలీసు పతకం ప్రెసిడెంట్ పోలీస్ మెడల్(పీపీఎం), ఇండియన్ పోలీస్ మెడల్ (ఐపీఎం)తో పాటు అంతర్జాతీయ శాంతి పోలీస్ పతకం అందాయి. పాస్‌పోర్ట్‌ల వెరిఫికేషన్‌లో దేశంలోనే అగ్రగామిగా నిలిచినందుకు విదేశాంగ శాఖ నుంచి ప్రశంసా పతకం వంటివి కూడా శివధర్‌రెడ్డి అందుకున్నారు. విధి నిర్వహణలో డాంబికాన్ని ప్రదర్శించకుండా సామాన్య ప్రజల సమస్యలను సైతం ఓపికతో విని పరిష్కరించే మనస్తత్వం కలిగిన శివధర్‌రెడ్డి తాను పని చేసిన ప్రతి ప్రాంతంలోనూ అటు ప్రజలు, ఇటు తన సబార్డినేట్‌ల నుంచి మన్ననలను పొందారు. ముఖ్యంగా ఇంటెలిజెన్స్ విభాగం, శాంతి భద్రతల విభాగంలో అపారమైన అనుభవాన్ని గడించిన శివధర్‌రెడ్డి పలు సంచలన కేసుల దర్యాప్తులోనూ మంచి ప్రావీణ్యాన్ని చూపించారనే పేరున్నది.

**30న ప్రస్తుత డీజీపీ పదవీ విరమణ**

ఈనెల 30న ప్రస్తుత డీజీపీ జితేందర్ పదవీ విరమణ చేస్తున్నారు. అక్టోబర్ 1న శివధర్‌రెడ్డి డీజీపీ పగ్గాలను స్వీకరిస్తారని తెలిసింది. ఆయనకు మరో ఏడాది కాలం పాటు సర్వీసు ఉన్నది. కాగా ఈయన కంటే సీనియర్, 1990 బ్యాచ్‌కు చెందిన నగర పోలీస్ కమిషనర్ సి.వి ఆనంద్‌కు కాకుండా శివధర్‌రెడ్డికి డీజీపీ పగ్గాలు ప్రభుత్వం అప్పగించటం పోలీసు వర్గాల చర్చనీయాంశమైంది. కాగా అక్టోబర్ చివరినాటికి రాష్ట్ర డీజీపీ ఎంపికకు సంబంధించి యూపీఎస్సీ నుంచి తాము పంపించిన సీనియారిటీ అధికారుల జాబితా రాగానే శివధర్‌రెడ్డికి పూర్తి స్థాయి హోదాతో డీజీపీగా ఆదేశాలు వచ్చే అవకాశమున్నదని ప్రభుత్వ వర్గాలను బట్టి తెలుస్తున్నది.

# పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరిన జంట జలాశయాలు

**- హిమాయత్ సాగర్ 9 గేట్లు , ఉస్మాన్ సాగర్ 12 గేట్లు ఎత్తివేత**

**బలగం టీవీ, హైదరాబాద్**

ఎగువలో కురుస్తున్న వర్షాలతో జంటజలాశయాల్లోకి భారీగా వరద నీరు వస్తోంది. అప్రమత్తమైన జలమండలి అధికారులు జంటజలాశయాల గేట్లు ఎత్తిరారు. హిమాయత్‌సాగర్ 9గేట్లను 5 అడుగు మేర ఎత్తి 14446 క్యూ సెక్కుల నీటి విడుదల చేస్తున్నారు. ఇక ఉస్మాన్‌సాగర్ 12గేట్లను 9 ఆడుగలమేర ఎత్తి 10668 క్యూ సెక్కుల నీరును దిగువకు విడుదల చేస్తున్నారు. ఉస్మాన్‌సాగర్ 1790 ఎఫ్‌టీఎల్‌కాగా, హిమాయత్‌సాగర్ ఎఫ్‌టిఎల్ 1763.50లు. అయితే గత మూడురోజులుగా కురుస్తున్న వర్షాలతో మొత్తం జంట జలాశయాల నుంచి 26000 క్యూసెక్కుల వరద నీరు మూసీ నదిలోకి విడుదల చేస్తున్నారు. గేట్ల ఎత్తివేత నేపథ్యంలో మూసీ నది పరివాహక ప్రాంత ప్రజల్ని అధికారులు అప్రమత్తం చేశారు. ఇక ట్యాంక్‌బండ్ (హుస్సేయిన్ సాగర్) ఇఫ్‌టీఎల్ 513.41 అడుగులుకాగా, ప్రస్తుతం 690క్యూసెక్‌ల వరద నీరువస్తోంది. దాంతో 890 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

# బీసీలకు స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లు

(మొదటి పేజీ తరువాయి)

2011 జనాభా లెక్కల ప్రకారం, బీసీ రిజర్వేషన్లను ఎస్ఈఈఈపీసీ-2024 ప్రకారం ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రాథమికంగా ఖరారు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లలోనూ మహిళలకు 50 శాతం సీట్లు కేటాయించారు.

స్థానిక ఎన్నికల నిర్వహణపై తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని శాఖలతో ఉన్నతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసింది. శనివారం ఉదయం 11 గంటలకు దీన్ని నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ, పంచాయతీరాజ్‌శాఖ ఉన్నతాధికారులు, కలెక్టర్లు పాల్గొంటారు.స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై చర్చిస్తారు. అదేరోజు సాయంత్రంగానీ, ఆదివారం గానీ రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు మీడియా సమావేశాన్ని నిర్వహించి నోటిఫికేషన్‌ను అధికారికంగా విడుదల చేసే అవకాశముంది.

**జెడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీ పదవులకు రిజర్వేషన్లు ఖరారు**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను వర్తింపజేస్తూ జీవో నెంబర్ 41ని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జారీ చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా రిజర్వేషన్ల కోసం మార్గదర్శకాలు జారీ చేసింది. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీ పదవులకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను 2011 జనాభా లెక్కలను ప్రామాణికంగా తీసుకుంటున్నట్లు, ఎస్ఈఈఈపీసీ నివేదిక ప్రకారం బీసీ రిజర్వేషన్లను అమలు చేయనున్నట్లు వెల్లడించింది. అదే సమయంలో అన్ని రిజర్వేషన్ల కోటాలోనూ మహిళలకు 50 శాతం వర్తింపజేయనున్నది. జిల్లా పరిషత్ చైర్మెన్/చైర్‌పర్సన్, జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ రిజర్వేషన్ల కేటాయింపు నిర్ణయాన్ని కలెక్టర్లకు అప్పగించింది.

# తెలంగాణ పర్యాటకానికి కొత్త ఊపు

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లోని ఆసుపత్రులు, అందుబాటులో ఉన్న వైద్య సేవలు, బీమా సౌకర్యం, వీసా జారీ, పొడగింపు వంటి సేవల వివరాలు పోర్టల్ ద్వారా అందుబాటులోకి వస్తాయి. ఆయా దేశాల నుంచి వచ్చే వారికి భాషాపరమైన ఇబ్బందులు లేకుండా ట్రాన్స్‌లేటర్ల వివరాలను కూడా పొందుపరిచారు.తాజాగా హెలి టూరిజాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతోంది. తొలుత హైదరాబాద్ నుంచి సోమశిల అక్కడి నుంచి శ్రీశైలం వరకు హెలికాప్టర్ సేవలు ప్రారంభించనున్నారు. పర్యాటకుల ఆదరణ ఆధారంగా తదుపరి దానిని మరింతగా విస్తరిస్తారు.

వైవిధ్యమైన తెలంగాణ వంటలు.. హైదరాబాద్ బిర్యాని, సర్వపిండి, సకినాలు వంటి ప్రత్యేక వంటకాలను ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ప్రాంతాల వారిగా ఆయా వంటలకు సంబంధించిన మ్యాప్ తయారు చేశారు.తెలంగాణను సందర్శించే ప్రతి పర్యాటకుడికి సరైన భద్రత కల్పించడం ప్రధాన ఎజెండాగా ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణలోని పర్యాటక ప్రదేశాలకు రైళ్లు, బస్సులు, ఇతర రవాణా సౌకర్యాలకు సంబంధించి ఐఆర్సీటీసీ, ఇతర ట్రావెల్ సంస్థలతో టూరిజం శాఖ ఒప్పందం చేసుకోనుంది. పర్యాటకుల కోసం డిజిటల్ టూరిజం కార్డులను కూడా అందుబాటలోకి తేనున్నారు. ఈ కార్డును రీచార్జీ చేసుకోవడం వల్ల వివిధ ఆలయాలు, రవాణా వాహనాలు, హొటళ్లలో రాయితీలు వంటి అదనపు సౌకర్యాలు అందుతాయి. పర్యాటక రంగంలో అందించే సేవల ఆధారంగా హొటళ్లు, ఇతర సంస్థలకు ప్రభుత్వం అవార్డులను ప్రదానం చేయనుంది. హుస్సేన్ సాగర్‌లో 120 సీట్ల సామర్థ్యమున్న ముచుకుందా డబుల్ డెక్కర్ బోట్‌ను ప్రభుత్వం ప్రారంభించనుంది.

రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు పరిస్థితులపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు గారు, ఇతర ఉన్నతాధికారులతో సమీక్షించారు. జిల్లాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.పలు జిల్లాల్లో ఈరోజు, రేపు రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచనల మేరకు ఆయా జిల్లాల్లో కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ప్రమాదకర పరిస్థితులు ఉన్న చోట ముందస్తు హెచ్చరికలతో ప్రజలను అప్రమత్తం చేయడమే కాకుండా అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్ నగరంలో కురుస్తున్న వర్షం నేపథ్యంలో జీహెచ్ఎంసీ, హైడ్రాతో పాటు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను అప్రమత్తంగా ఉంచాలని, భారీగా నీరు చేరే ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకునేలా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తంగా చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గారికి సూచించారు.

# పువ్వులను పూజించడం తెలంగాణ గొప్ప సంస్కృతి..

- జిల్లా ప్రజలకు,పోలీస్ కుటుంబ సభ్యులందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు..
- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే
- జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు..



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దంపట్టే బతుకమ్మ వేడుకలు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆట పాటలు, కోలాటాల మధ్య బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. ఈ యొక్క కార్యక్రమానికి జిల్లా ఎస్పీ హాజరై వేడుకలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే పండుగ అని ఇలాంటి వేడుకలు సాంప్రదాయ విలువలను కాపాడటమే కాకుండా, కుటుంబ బంధాలను మరింత బలపరుస్తాయి అని అన్నారు. ఎక్కడైనా దేవుళ్ళకు పూలు పెట్టి కొలుస్తాము, కానీ పువ్వులనే దేవతగా కొలిచే సాంప్రదాయం ఒక తెలంగాణ లో మాత్రమే ఉందన్నారు. తెలంగాణ సంస్కృతికి చారిత్రక చిహ్నం బతకమ్మని మరియు తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ వేడుకలు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతున్నాయి తెలిపారు. పోలీసు వారి కుటుంబ సభ్యులతో బతుకమ్మ ఆడటం ఇంత మంది కుటుంబ సభ్యులను కలిసినందుకు వారితో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నందుకు ఆనందంగా ఉందని అన్నారు.

ఈ సందర్భంగా ఎస్పీ పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ ఆడుతూ సాంప్రదాయ ఉత్సాహాన్ని పంచుకున్నారు. మహిళా పోలీస్ సిబ్బంది అందరూ రంగురంగుల చీరలతో బతుకమ్మలను అలంకరించి పాటలు పాడుతూ ఆనందోత్సాహాలతో వేడుకను జరిపారు. అలాగే అందంగా,సాంప్రదాయ శైలిలో బతుకమ్మలను రూపొందించిన వారికి ప్రత్యేక బహుమతులను ప్రదానం చేసి సత్కరించారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి, సి.ఐ లు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, వీరప్రసాద్, శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ సి.ఐ రవి, ఆర్.ఐ లు మధుకర్, రమేష్, యాదగిరి, ఏ. ఓ పద్మ, ఎస్.ఐ లు, సిబ్బంది, పోలీస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిపేట సహకార సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లాకే ఆదర్శం

- ప్రాథమిక వ్యవసాయ మహాజన సభ సహకార సంఘం చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

శుక్రవారం రోజున ప్రాథమిక వ్యవసాయ మహాజన సభ సహకార సంఘం ఎల్లారెడ్డిపేట లో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి అధ్యక్షతన సంఘ కార్యాలయం భవనం నందు మహాజన సభ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తేదీ: 01-04-2025 నుండి 15-09-2025 వరకు గల ఆదాయ, వ్యయ నివేధికలు ప్రవేశపెట్టడం, ఆడిట్ పూర్తి కాబడిన 2024-25 సం" ఆడిట్ నివేదిక సమర్పించడం జరిగిందని, వాటిని సభ్యులు ఆమోదించడం జరిగిందని తెలిపారు. సభ్యులకు గల సందేహాలను మరియు వారి నుండి విలువైన సూచనలు స్వీకరించారు. తదుపరి సభ్యులకు గల సందేహాలను నివృత్తి చేశారు.

ఈ సందర్భంగా చైర్మన్ ఎల్లారెడ్డిపేట సహకార సంఘంనకు టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు సహకారంతో పెద్ద ఎత్తున దీర్ఘకాలిక రుణాలు మరియు స్వల్పకాలిక రుణాలను మంజూరు చేశామని, ఎల్లారెడ్డిపేట సహకార సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే A + గ్రేడ్ లోన్ ఉంది అని వారు ఈ సందర్భంగా తెలియజేశారు. అలాగే NABARD మరియు DCCB సహకారంతో రెండు గోదాములు, పెట్రోల్ బంక్ మంచి ఆఫీస్ భవనం నిర్మించుకోవడం జరిగిందని వారు అన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి క్రాఫ్ లోన్ రెన్యూవల్ చేసుకోవాలని, రెన్యువల్ చేసుకున్న వారికి 7 శాతం లో రిబేట్ 3 శాతం తిరిగి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ మానిటరింగ్ ఆఫీసర్ షఫీయోద్దిన్, సంఘ వైస్ చైర్మన్ జంగిటి సత్తయ్య, సంఘ డైరెక్టర్లు, గొట్టే సరితసుధాకర్, కోనేటి ఎల్లయ్య, నేవూరి వెంకట నరసింహారెడ్డి, గండ్ర ప్రభాకర్ రావు, కనకట్ల సుధాకర్, వీరితోపాటు రైతులు కోల కొండయ్య, సుర అశోక్, గడ్డం ఆనందం, వంగాల లక్ష్మణ్, నవజీవన్ రెడ్డి, మోతే నరసింహారెడ్డి, రామ కిష్టారెడ్డి, నేవూరి పద్మా రెడ్డి, మద్దుల శ్రీపాల్ రెడ్డి, గొట్టే సురేందర్, బందారపు మల్లారెడ్డి, బందారపు బాల్ రెడ్డి, ఈసారి నర్సయ్య, జంగా అంజిరెడ్డి, దమ్మ భూమిరెడ్డి, కుంభాల ప్రభాకర్, సల్వాజీ శ్రీనివాస్, లింగాల దాస్, ఎగదండి నర్సయ్య, తదితర రైతులు సంఘ సెక్రటరీ సనుగుల కిషోర్ కుమార్ సంఘ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సమాజ సంఘటన కార్యమే ఆర్ఎస్ఎస్ లక్ష్యం..



**కరింనగర్ జిల్లా పర్యావరణ ప్రముఖ్ బత్తిని ఆంజనేయులు**

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండలంలోని గాలిపల్లి గ్రామంలో సామ అంతవ్వ నరసింహారెడ్డి ఫంక్షన్ హాలులో రాష్ట్రీయ స్వయం సేవక్ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయ దశమి ఉత్సవంలో ముఖ్య వక్త కరీంనగర్ జిల్లా పర్యావరణ ప్రముఖ్ బత్తిని ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ 1925 ప్రారంభమైందని అన్నారు. 2025 విజయదశమి నాటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంది అన్నారు. శతజయంతి ఉత్సవాల్లో భాగంగా రాబోయే రోజులలో జనజాగరణ, హిందూ సమ్మేళనాలు, యువకుల సమ్మేళనాలు, ప్రతిష్ట వ్యక్తుల సమ్మేళనాలు, కార్యక్రమాలను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ 100 సంవత్సరముల కాలంలో అనేక విజయాలను సాధించిందని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సంస్థగా ఆర్ఎస్ఎస్ నిలబడింది అన్నారు. ఆర్ఎస్ఎస్ లో తయారైనటువంటి స్వయంసేవకులు వివిధ రంగాలలో పనిచేస్తున్నారని అన్నారు.క్రమశిక్షణ, త్యాగము సమర్పణ, పట్టుదల కలిగిన కార్యకర్తలను నిర్మాణం చేయడమే ఆర్ఎస్ఎస్ లక్ష్యం అని అన్నారు.సమాజంలోని వ్యక్తులను మంచి వ్యక్తులుగా తీర్చిదిద్దడమే సంఘం పని అన్నారు. పంచ పరివర్తన లో భాగంగా సమాజంలో కుల మత భేదం లేకుండా ఉండడం, పౌర విధులు నిర్వర్తించడం,గో ఆధారిత వ్యవసాయం చేయడం, పర్యావరణాన్ని పరిరక్షించడం, కుటుంబ విలువలను కాపాడుకోవడం, పాటించడం విషయాలను తెలియజేయాలని చెప్పారు. ఈ కార్యక్రమం లో ముఖ్యఅతిథి తాటికొండ అంజయ్య, ఖండ కార్య వాహ్ తాటి పెల్లి మహేష్, ఖండ వ్యవస్థ ప్రముఖ్ కాసుపాక కిషన్, సేవ ప్రముఖ్ బొల్లం ధనుంజయ, బాలనాగచారి, పల్లె లక్ష్మణ్, కాసం మహేష్, సింగిరెడ్డి రమణారెడ్డి, కుంభం సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా పోలీస్ కార్యాలయంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

చిట్యాల చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, సబ్బండ వర్గాల ఆత్మగౌరవ ప్రతీక చాకలి ఐలమ్మ అని, బానిసత్వాన్ని బద్దలు కొట్టి సమాజానికి చైతన్యాన్ని అందించిన వీరనారి అని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఐపిఎస్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, సి.ఐ లు నాగేశ్వరరావు, మధుకర్, ఆర్.ఐ లు రమేష్, యాదగిరి,ఏ. ఓ పద్మ,ఎస్.ఐ లు, పోలీస్ కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# అమ్మవారి మండపాల వద్ద చల్మెడ ప్రత్యేక పూజలు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు శుక్రవారం కొనరావుపేట మండలంలోని నాగారం, కొలనూరు గ్రామాల్లోని అమ్మవారి ఆలయ మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండప నిర్వాహకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ, నవరాత్రులలో అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించి, ప్రత్యేక పూజలు చేసి దసరా వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. మండల ప్రజలంతా సుభిక్షంగా, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ అమ్మవారిని వేడుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య, ప్యాక్స్ చైర్మెన్ రామ్ మోహన్ రావు, మాజీ ఎంపీపీ చంద్రయ్య గౌడ్, నాయకులు శ్రీనివాస్, రాజయ్య, కిషన్ రావు, వెంకన్న సీనియర్ నాయకులు మంతెన సంతోష, గోపు పర్శరాములు, గంగాధర్, అన్వేష్, అభి, మామిండ్ల అంజయ్య, తాళ్లపల్లి సతీష్ గౌడ్, చంద్రయ్య గౌడ్, దుద్దేటి రాములు, యాట ముత్తయ్య, జవాజి శీను, శ్యామల శీను, వీరవేణి మల్లేశం, తాళ్ల పెల్లి పవన్ గౌడ్, పరుశరాములు, సాయి, బిట్ల బాబు, మెరుగు బాను, పెద్ది విష్ణు, దుర్గ మాత కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు..

**బలగం టీవీ, వేములవాడ**

వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ చౌక్ లో ఉన్నటు వంటి చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి మార్కెట్ వైస్ చైర్మన్ కనికరపూ రాకేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్తాది కృష్ణ నాయకులుయు సంఘ స్వామి యాదవ్, అబ్దుల్ రజాక్, మైలారం రాము, మర్రిపల్లి రాజు, కొక్కుల రాజు, రాజేశం, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మన్మోహన్ సింగ్ జయంతి వేడుకలు..

**బలగం టీవీ, వేములవాడ**



వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా మన్మోహన్ సింగ్ జయంతి వేడుకలు నిర్వహించడం జరిగింది మన్మోహన్ సింగ్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాగర వెంకటస్వామి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్తాది కృష్ణ, ఖమ్మం గణేష్ నాయకులు పుల్కం రాజు, అబ్దుల్ రజాక్, అక్కనపల్లి నరేష్, కొక్కుల రాజు, సాయిని అంజయ్య, మరిపెల్లి రాజు, తదితరులు పాల్గొన్నారు.



## భారత్ ఏ విజయం

బలగం టీవీ, హైదరాబాద్

సీనియర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ (210 బంతుల్లో 176 నాటౌట్, 16 ఫోర్లు, 4 సిక్స్‌లు) అజేయ శతకానికి తోడు సాయి సుదర్శన్ (100) సెంచరీతో కదంతొక్కడంతో ఆస్ట్రేలియా 'ఏ'తో జరిగిన రెండో అనధికారిక టెస్టులో భారత్ 'ఏ' రికార్డు విజయాన్ని అందుకుంది. 413 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు గాను ఓవర్‌నైట్ స్కోరు 169/2తో నాలుగో రోజు ఆట ఆరంభించిన భారత్.. 91.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదనను పూర్తిచేసింది. సాయి నిష్క్రమించాక కెప్టెన్ ధ్రువ్ జురెల్ (56), నితీశ్ రెడ్డి (16లి)తో కలిసి రాహుల్ గెలుపు లాంఛనాన్ని పూర్తిచేశాడు. కాగా భారత్‌లో ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఇది విజయవంతమైన ఆరో అత్యధిక ఛేధన. ఈ జాబితాలో వెస్ట్‌జోన్.. 2010 దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో సౌత్‌జోన్ నిర్దేశించిన 536 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించడమే ఇప్పటిదాకా అత్యుత్తమంగా ఉంది. ఈ విజయంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 1-0తో గెలుచుకుంది.



## రౌఫ్ మ్యాచ్ ఫీజులో కోత.. ఫర్హాన్‌కు మందలింపు

బలగం టీవీ, హైదరాబాద్

ఆసియా కప్‌లో భాగంగా భారత్‌తో ఇటీవల ముగిసిన సూపర్-4 మ్యాచ్‌లో అభ్యంతరకర హావభావాలతో టీమ్‌ఇండియా అభిమానులను రెచ్చగొట్టేవిధంగా ప్రవర్తించిన పాకిస్థాన్ క్రికెటర్లు హరీస్ రౌఫ్, ఫర్హాన్‌పై ఐసీసీ చర్యలకు దిగింది. రౌఫ్ మ్యాచ్ ఫీజులో 30 శాతం కోత విధించగా ఫర్హాన్‌ను మందలించి మళ్లీ ఇలాంటివి చేయరాదని వార్నింగ్ ఇచ్చింది. బీసీసీఐ ఫిర్యాదు మేరకు శుక్రవారం ఐసీసీ మ్యాచ్ రిఫరీ రిచి రిచర్డ్‌సన్ ఎదుట విచారణకు హాజరైన రౌఫ్.. మ్యా చ్‌లో తాను చేసిన సంజ్ఞ (ఆపరేషన్ సిం ధూర్‌లో పాక్ సైన్యం భారత్‌కు చెందిన ఆరు ఫైటర్ జెట్లను కూల్చిందనేదానిని ప్రతిబింబించేలా చేతి వేళ్లతో ఆరు అని చూపించడం)లు భారత్‌ను ఉద్దేశించినవికావని విచారణలో చెప్పినట్టు తెలిసింది.



### ఫిరాయింపు ఎమ్మెల్యేలపై

## 29 నుంచి ప్రత్యక్ష విచారణ

(మొదటి పేజీ తరువాయి)

గత ఏడాది బీఆర్ఎస్ ఈ ఎమ్మెల్యేలపై ఫిరాయింపు నిరోధక చట్టం కింద అనర్హత వేటు వేయాలని స్పీకర్‌కు ఫిర్యాదు చేసింది. అయితే చర్యలు ఆలస్యం కావడంతో పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై %ఖుజూవఇ% కోర్టు మూడు నెలల్లో విచారణ పూర్తిచేయాలని స్పీకర్‌ను ఆదేశించింది. దీంతో ఈ నెల 29 నుంచి విచారణ ప్రారంభించాలని ప్రసాద్‌కుమార్ నిర్ణయించారు. వచ్చే నెల 6న ఆయన విదేశీ పర్యటనకు వెళ్ళనున్నందున ముందుగానే ఈ ప్రక్రియ చేపట్టాలని భావిస్తున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన పది మంది ఎమ్మెల్యేలలో కొందరు ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో కలసి చర్చలు జరపడం వివాదాస్పదమైంది. "కండువా కప్పుకున్నంత మాత్రాన ఫిరాయించినట్టేనా?" అని వారు ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గ సమస్యలపై మాత్రమే సీఎం వద్దకు వెళ్లామని స్పష్టం చేస్తున్నారు.బీఆర్ఎస్ మాత్రం అరికెపూడి గాంధీకి పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ పదవి రావడం ఫిరాయింపుకే నిదర్శనమని చెబుతోంది. దీనిపై గాంధీ తన సమాధానంలో "ప్రధాన ప్రతిపక్షానికే చైర్మన్ పదవి వస్తుంది. అందువల్లే ఆ బాధ్యత దక్కింది" అని పేర్కొన్నారు. ఇక ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, బీఆర్ఎస్‌లో ఉంటూనే సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోవడం కూడా ఫిరాయింపు నిర్ధారణకే ఉదాహరణ అని బీఆర్ఎస్ వాదిస్తోంది. ప్రస్తుతం స్పీకర్ విచారణ వేగవంతం చేయాలని నిర్ణయించుకోవడంతో, ఫిరాయింపు ఎమ్మెల్యేల భవిష్యత్తుపై అసెంబ్లీ రాజకీయ వాతావరణం వేడెక్కింది.

# భారత్ సూపర్ విక్టరీ

- సూపర్ ఓవర్‌లో విజయం
- నిస్సనక సెంచరీ వృథా
- అదరగొట్టిన అభిషేక్

బలగం టీవీ, హైదరాబాద్

ఆసియాకప్‌లో భారత్, శ్రీలంక సూపర్-4 పోరు సూపర్ గా నిలిచింది. టీ20 మజాను అందిస్తూ ఆఖరి వరకు గెలుపు దోబూచులాడిన పోరులో టీమ్‌ఇండియాదే పైచేయి అయ్యింది. నిర్ణీత ఓవర్లలో ఇరు జట్ల స్కోర్లు(202/5) సమం కావడంతో విజేతను నిర్ణయించేందుకు జరిగిన సూపర్ ఓవర్‌లో భారత్..అద్భుత విజయం సాధించింది. మొదట లంక నాలుగు బంతుల్లో రెండు వికెట్లు(కుశాల్, శనక)కోల్పోయిన రెండు పరుగులే చేసింది. ఛేదనలో టీమ్ఇండియా తొలి బంతికే విజయాన్నందుకుంది.









ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 202 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ(31 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 61), తిలక్ వర్మ(34 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 49 నాటౌట్) విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగగా.. సంజూ శాంసన్(23 బంతుల్లో ఫోర్, 3 సిక్స్‌లతో 39), అక్షర్ పటేల్ (15 బంతుల్లో ఫోర్, సిక్స్‌తో 21 నాటౌట్) మెరుపులు మెరిపించారు. శ్రీలంక బౌలర్లలో మహీష తీక్షణ, దుష్మంత్ చమీర, వానిందు హసరంగ, డసన్ షనక, చరిత్ అసలంక చెరో వికెట్ తీసారు.

అనంతరం శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 202 పరుగులే చేసింది. పాతుమ్ నిస్సంక(58 బంతుల్లో7 ఫోర్లు, 6 సిక్స్‌లతో 107 నాటౌట్) సెంచరీతో చెలరేగగా.. కుశాల్ పెరీరా(32 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 58) హాఫ్ సెంచరీతో రాణించాడు. డసన్ షనక(11 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 22 నాటౌట్) మెరుపులు మెరిపించాడు. భారత బౌలర్లలో హార్దిక్ పాండ్యా, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా తలో వికెట్ తీసారు.

ఆఖరి ఓవర్‌లో శ్రీలంక విజయానికి 12 పరుగులు అవసరం కాగా.. హర్షిత్ రాణా తొలి బంతికే సెంచరీ హీరో పాతుమ్ నిస్సంకను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. తర్వాతి మూడు బంతుల్లో 5 పరుగులు రాగా.. ఐదో బంతిని షనక బౌండరీ తరలించాడు. దాంతో ఆఖరి బంతికి శ్రీలంక విజయానికి మూడు పరుగులు అవసరం కాగా.. రెండు పరుగులు మాత్రమే వచ్చాయి. దాంతో మ్యాచ్ టై అయ్యి సూపర్ ఓవర్ ఆడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాతుమ్ నిస్సంక వికెట్‌తో మ్యాచ్ మలుపు తిరిగింది.

సూపర్ ఓవర్‌లో అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్ చేయగా.. తొలి బంతికే కుశాల్ పెరీరా(0) ఔటయ్యాడు. తర్వాతి రెండు బంతులకు వైడ్ సాయంతో రెండు పరుగులే రాగా.. నాలుగో బంతికి డసన్ షనక సింగిల్ తీయబోయి రనౌట్ అయ్యాడు. అయితే రనౌట్ కంటే ముందే అంపైర్ క్యాచ్ ఔట్ ఇవ్వగా.. షనక రివ్యూ తీసుకున్నాడు. కానీ బంతి బ్యాట్‌కు తగలకపోవడంతో నాటౌట్‌గా తేలింది. అంపైర్ నిర్ణయం తర్వాత బంతి డెడ్ అవుతుంది. కాబట్టి రనౌట్ లెక్కలోకి రాదు. దాంతో షనక ఔటవ్వకుండా బచాయించాడు. ఈ నిర్ణయం అభిమానులతో పాటు భారత ఆటగాళ్లను అయోమయానికి గురి చేసింది. కానీ అంపైర్లు ఆటగాళ్లకు వివరించి చెప్పారు. కానీ మరుసటి బంతికే షనక క్యాచ్ ఔటయ్యాడు. దాంతో భారత్ లక్ష్యం మూడు పరుగులుగా నమోదైంది. అనంతరం భారత్ ఒక్క బంతికే మూడు పరుగులు చేసి గెలుపొందింది.ఏకపక్ష మ్యాచ్‌లతో చప్పగా సాగిన ఆసియా కప్ 2025 టోర్నీలో ఈ మ్యాచ్ అసలు సిసలు మజా అందించింది. చరిత్రలో నిలిచిపోయింది.





## సూర్యకు జరిమానా.. బీసీసీఐ అప్పీల్

బలగం టీవీ, హైదరాబాద్

ఆసియా కప్ టి20 క్రికెట్ టోర్నీలో పాకిస్తాన్‌పై విజయాన్ని భారత సైనికులకు అంకితం ఇస్తున్నట్లుగా భారత జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ చేసిన ప్రకటనపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) స్పందించింది. ఈ వ్యాఖ్య రాజకీయపరమైనదని, ఇది క్రీడాస్ఫూర్తికి విరుద్ధమంటూ అతనిపై చర్య తీసుకుంది. సూర్యకుమార్ మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానాగా విధించింది. సెప్టెంబర్ 14న లీగ్ దశలో పాక్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మ్యాచ్ ముగిసిన తర్వాత 'పహల్గామ్ ఉగ్రవాద దాడి బాధితులకు మేం అండగా ఉంటాం. మా విజయం భారత సైనికులకు అంకితం' అని సూర్య వ్యాఖ్యానించాడు. క్రీడల్లో ఆర్మీ ప్రస్తావన తీసుకురావడాన్ని ప్రశ్నిస్తూ పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఐసీసీకి ఫిర్యాదు చేసింది. గతంలోనూ రాజకీయపరమైన, గాజాపై ఇజ్రాయిల్ దాడివంటి అంశాలపై క్రికెటర్లు స్పందించకుండా ఐసీసీ ఆంక్షలు పెట్టిన విషయాన్ని పీసీబీ తమ ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఘటనపై మ్యాచ్ రిఫరీ రిచీ రిచర్డ్సన్ విచారణ జరిపారు. రిఫరీ ముందు హాజరైన సూర్యకుమార్ తాను ఎలాంటి తప్పు చేయలేదని సమాధానమిచ్చాడు. సూర్య వివరణపై విభేదించిన రిఫరీ ఇక ముందు ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని హెచ్చరిస్తూ 30 శాతం జరిమానా విధించారు. ఈ శిక్షపై బీసీసీఐ అప్పీల్ చేసినట్లు సమాచారం. అయితే మళ్లీ ఎప్పుడు విచారణ జరుగుతుందనే విషయంలో స్పష్టత లేదు. ఇక్కడా కూడా సూర్యదే తప్పని నిర్ధారణ అయితే శిక్ష మరింత పెరుగుతుంది.

## జనవరి 14న 'అనగనగా ఒకరాజు'

బలగం టీవీ, హైదరాబాద్





హాస్య నటుడిగా తన ప్రత్యేకమైన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తే నవీన్ పొలిశెట్టి మరోసారి ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'అనగనగా ఒకరాజు' సంక్రాంతి పండగలో జనవరి 14న రిలీజ్ కానుంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా మీనాక్షి చౌదరి నటిస్తున్నారు. మారి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాకు సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మాణ బాధ్యతలు స్వీకరించారు. సినిమా సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్చూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్‌లో నిర్మించబడుతోంది. కెమెరా దర్శకత్వం జె.యువరాజ్, సంగీతం మిక్కీ జె మేయర్ అందిస్తున్నారు. టీజర్‌లో ఆభరణాల స్పూఫ్‌తో ప్రారంభం, కోనసీమ నేపథ్యంతో కామెడీ, రొమాన్స్ అంశాల కలయికగా వినోదాన్ని అందించిందని నిర్మాతలు తెలిపారు. సంక్రాంతి పండగలో ప్రేక్షకులు కోరుకునే అసలైన వినోదాన్ని ఈ సినిమా అందించనుంది అని మేకర్స్ తెలిపారు.

### 'ఓజీ' సినిమాకు

## హైకోర్టు మరోసారి షాక్

బలగం టీవీ, హైదరాబాద్

ఏపీ డిప్యూటీ సీఎం, పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ నటించిన 'ఓజీ' సినిమాకు తెలంగాణ హైకోర్టు మరోసారి ప్రతికూల నిర్ణయం తీసుకుంది. రివ్యూ అనంతరం కూడా సినిమా టికెట్ రేట్ల పెంపునకు హైకోర్టు అనుమతి ఇవ్వలేదు. హైకోర్టు జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్ కుమార్ బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వం 'ఓజీ' బెనిఫిట్ షోలు, టికెట్ రేట్ల పెంపు కోసం జారీ చేసిన ఆదేశాలు అక్టోబర్ 9 వరకు నిలువనివ్వబడ్డాయి. అలాగే, ప్రభుత్వానికి టికెట్ రేట్ల పెంపుకు కారణాలను వివరించే కౌంటర్ దాఖలు చేయమని ఆదేశాలు జారీచేశారు. హైకోర్టు సింగిల్ బెంచ్ ఇప్పటికే నిర్ణయించినట్లుగా, 18 ఏండ్ల కిందటివారికి 'ఓజీ' టికెట్లు విక్రయించకూడదని, బెనిఫిట్ షో ద్వారా వచ్చే రాబడిని వీధి పిల్లలు, అనాథల సంక్షేమానికి వినియోగిస్తారా అనే అంశాలను పరిశీలించమని స్పష్టంగా పేర్కొంది. ఈ మధ్యంతర ఉత్తర్వులు హైదరాబాద్‌కు చెందిన బీ మల్లేశ్ యాదవ్ దాఖలు చేసిన పిటిషన్‌పై జారీ చేయబడ్డాయి. రాష్ట్ర హెూంశాఖ ముఖ్యకార్య దర్శి, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్, మరియు డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్కు నోటీసులు జారీ చేసి, తదుపరి విచారణను అక్టోబర్ 9కి వాయిదా వేసింది.